క్లుప్తంగా

ఆన్‌లైన్ బెట్టింగ్ డ్రగ్స్ కంటే తీవ్ర సమస్య



నిజామాబాద్‌నాగారం: ఆన్‌లైన్ బెట్టింగ్ అనేది మాదకద్రవ్యాల కన్నా తీవ్ర సమస్య అని, యువతకు వ్యసనంగా, దేశభద్రతకు ముప్పుగా పరిణమిస్తోందని ప్రముఖ న్యూరో సైకియాట్రిస్ట్ ఆకుల విశాల్ అన్నారు. నగరంలోని ఖలీల్‌వాడీలో ఉన్న విశాల్ ఆల్కహాల్ డ్రగ్ డీ–అడిక్షన్ సెంటర్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో యువత ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిణామాలు, ఆర్థిక స్థిరత్వాన్ని పొందేందుకు మార్గదర్శకాలు చర్చించారు. సోషల్ మీడియా, బెట్టింగ్ యాప్‌ల ప్రభావంతో వ్యక్తులు ఆర్థిక సంక్షోభం, ఆత్మహత్యా ప్రవృత్తులకు లోనవుతున్నారని అన్నారు. ప్రత్యేక చికిత్స పద్ధతుల ద్వారా ఆర్థికమానసిక స్థిరత్వాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ కృష్ణారావు, ఆధ్యాత్మికత ప్రచారకుడు చిరంజీవి, రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ జీవన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను సమర్పించాలి

సిరికొండ: రాజీవ్ యువ వికాసం పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు దరఖాస్తులను మండల పరిషత్ కార్యాలయంలోని ప్రజాపాలన సేవా కేంద్రంలో సమర్పించాలని ఎంపీడీవో కేఆర్ మనోహర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని వారు ఆఫ్‌లైన్‌లో మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుల సమర్పణకు ఈ నెల 14 చివరి తేది అని ఎంపీడీవో తెలిపారు.

నియామకం

నిజామాబాద్ రూరల్: తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన రచయిత, ప్రభుత్వ టీచర్ బానోత్ ప్రేమలాల్ నియామకం అయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడికి ప్రేమ్‌లాల్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

నిజామాబాద్ రూరల్: మండలంలోని ఆకుల కొండూర్‌లో సన్‌రైస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో గ్రామస్తులకు శనివారం ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రిజర్వాయర్ మరమ్మతులు పూర్తి చేయాలి

నవీపేట/రెంజల్(బోధన్): నవీపేట మండలంలోని అభంగపట్నం రిజర్వాయర్ మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. మండలంలోని అభంగపట్నం, నవీపేట, నాగేపూర్ గ్రామాలలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం అభంగపట్నంలో రైతులు సాగునీటి సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. రిజర్వాయర్‌లో నీరు తక్కువగా ఉందని, మరమ్మతులు చేసేందుకు అనుకూలంగా ఉంటుందని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఇరిగేషన్ ఈఈ బలరామ్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో మరమ్మతులు చేయాలని ఆదేశించారు. అనంతరం రెంజల్ మండలంలోని నీలా గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ తాహెర్‌బిన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి, నాయకులు నగేష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్, నీలా విండో చైర్మెన్ ఇమ్రాన్, రఘు పాల్గొన్నారు.

ఘనంగా పంపా సాహితీ పీఠం కవి సమ్మేళనం



బోధన్: పట్టణంలోని ఉషోదయ జూనియర్ కళాశాలలో శనివారం బోధన్‌కు చెందిన పంపా సాహితీ పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా పీఠం ప్రతినిధులు, కవులు, ముఖ్య అతిథులు పంప కవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కవులు, రచయితలు సమ్మేళానికి అధిక సంఖ్యలో వచ్చారు. వివిధ అంశాలపై కవితాగానం చేశారు. ఈసందర్భంగా కవులకు, పీఠం ప్రతినిధులకు సన్మానం చేశారు. బోధన్ తహసీల్దార్ విఠల్, ఎంఈవో నాగయ్య, పోతంగల్ ఎంఈవో లోల శంకర్, పీఠం అధ్యక్ష, కార్యదర్శులు పురాణే అజయ్ కుమార్, పబ్బమురళి, ప్రిన్సిపల్ ఆనంద్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్ పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జగ్జీవన్‌రామ్

- నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి
- జయంతి వేడుకల్లో వక్తలు



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీసీపీ రామచంద్రారావు, పోలీసులు

మోపాల్/ ఖలీల్‌వాడి/ సిరికొండ / నిజామాబాద్ అర్బన్/ జక్రాన్‌పల్లి : భారత మాజీ ఉప ప్రధాని, సంఘ సంస్కర్త బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజక వర్గాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అన్నారు. నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, బీజేపీ, ప్రజా సంఘాల నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి డీసీపీ(ఏఆర్) రామచంద్రారావు, పోలీసులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.
సిరికొండ మండలంలోని గడ్కోల్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. జిల్లా కేంద్రంలో బీసీటీయూ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు మాడవేటి వినోద్‌కుమార్, టీఎన్జీవోస్ అధ్యక్షుడు సుమన్, ఏబీవీపీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి, చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లు అర్పించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రంలో జగ్జీవన్ రామ్ జయంతి నిర్వహించారు.



బోర్గాం చౌరస్తాలో కేక్ కట్ చేసి తినిపిస్తున్న నాయకులు



సిరికొండ: గడ్కోల్‌లో నివాళులు అర్పిస్తున్న గ్రామస్తులు



బార్ అసోసియేషన్ కార్యాలయంలో..



జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేస్తున్న మాదిగ జేఏసీ నాయకులు



బీసీటీయూ నాయకులు



నివాళులు అర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు



జక్రాన్‌పల్లిలో నివాళులర్పిస్తున్న స్థానికులు



ఎస్సీ, ఎస్టీ, బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఇంటింటి సర్వే



సుద్దపల్లిలో సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు



పాల్దాలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న వలంటీర్లు

డిచ్‌పల్లి: తెలంగాణ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్–1, 4 ఆధ్వర్యంలో డిచ్‌పల్లి మండలం సుద్దపల్లిలో నిర్వహిస్తున్న వేసవి కాల ప్రత్యేక శిబిరంలో భాగంగా శనివారం వలంటీర్లు గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వే ద్వారా కుటుంబాల ఆర్థిక పరిస్థితులు, జీవన స్థితిగతులు తెలుస్తాయని, 25 ఏళ్ల గల యువత ఉన్నత విద్యను అభ్యసించినప్పటికీ ఇంకా నిరుద్యోగులుగా ఉండటానికి గల కారణాలను విశ్లేషించనున్నట్లు ప్రోగాం ఆఫీసర్లు ప్రవంతి, స్వప్న తెలిపారు. యువత వృత్తి విద్య, నైపుణ్యాలు కలిగి విద్యను నేర్చుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు అందించే ప్రోత్సాహకాల గురించి అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వలంటీర్లు పాల్గొన్నారు.
నిజామాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని జీజీ కాలేజ్ ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని పాల్దా గ్రామంలో ఆలయాలు, సీసీ రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి, ప్రోగ్రాం అధికారి నరేశ్ కుమార్, వీడీసీ సభ్యులు, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నగరంలో ప్రత్యేక పారిశుధ్య పనులు



నిజామాబాద్ సిటీ : శ్రీరామనవమి పండగ సందర్భంగా నగరంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. శనివారం నగరంలోని రామాలయాల వద్ద శానిటేషన్ సిబ్బందితో మున్సిపల్ అధికారులు ఆలయ పరిసరాలను శుభ్రం చేయించారు. సుభాష్ నగర్‌లోని రామాలయం, ఖిల్లాలోని రఘునాథ ఆలయం, సారంగపూర్‌లోని హనుమాన్ ఆలయ పరిసరాలను ప్రత్యేక పారిశుధ్య సిబ్బందితో పనులు చేపట్టారు. పిచ్చిమొక్కలను తొలగింపజేశారు. రోడ్లను శుభ్రం చేయించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్, ఏఎంసీ జయకుమార్ పనులను పరిశీలించారు.

నిర్లక్ష్యపు నిప్పు.. మొక్కలకు ముప్పు



బైపాస్ రోడ్డులో హరితహారం మొక్కలకు నిప్పుపెట్టిన ప్రాంతం

పర్యావరణాన్ని పరిరక్షించేందుకు జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా గత ప్రభుత్వ హయాంలో అధికారులు హరితహారం మొక్కలు నాటారు. అయితే కొందరు నిర్లక్ష్యంగా మొక్కలకు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. ఆహ్లాదాన్ని పంచాల్సిన హరితహారం చెట్లు, మొక్కలు ఇలా బుగ్గిపాలు కావడంతో వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి వాటి సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. – నిజామాబాద్ రూరల్

గణిత పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నిజామాబాద్‌అర్బన్: నగరంలోని విశ్వవికాస్ పాఠశాలకు చెందిన విద్యార్థులు హైదరాబాద్‌కు చెందిన స్వమేదా సంస్థ వారు నిర్వహించిన గణితం పోటీల్లో ప్రతిభ చాటారు. ఈ పోటీలు మార్చి 15న హైదరాబాద్‌లో నిర్వహించగా వాటి ఫలితాలను శనివారం వెలువరించారు. ఈ ఫలితాల్లో పాఠశాలకు చెందిన యశ్వంత్, సాత్విక, అఖిరా, సహస్ర ప్రతిభ చాటి బహుమతులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సుస్మిత పేర్కొన్నారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందడం సంతోషంగా ఉందని అన్నారు.





మంచిప్పలో పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు తొర్లికొండలో..

రాజ్యాంగ మార్పు కుట్రను తిప్పికొట్టాలి

- నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి
- గ్రామాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం



ఎల్లమ్మగుట్టలో ప్రజలతో మాట్లాడుతున్న నాయకులు

మోపాల్/నిజామాబాద్‌సిటీ/ఇందల్వాయి/ జక్రాన్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చే కుట్రను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని నర్సింగ్‌పల్లి, మంచిప్ప, బైరాపూర్, కాల్పోల్, శ్రీరాంనగర్ తండాల్లో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అదేవిధంగా గ్రామాల్లో పాదయాత్ర చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. గాంధీ, అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి పౌరుడు కృషి చేసి రాజ్యాంగంలో పొందుపర్చిన విషయాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. పౌరుల హక్కులను కాలరాస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సాయిరెడ్డి, తూర్పు రాజేశ్, కెతావత్ మోహన్, ఈశ్వర్ నాయక్, సాయిరాం, శంకర్, విఠల్, గోవింద్, సురేశ్, భూపతిరెడ్డి, వెంకట్రాం నాయక్, మిత్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని 19, 20 డివిజన్‌లలో, ఎల్లమ్మగుట్టలో కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం గురించి కాలనీవాసులకు వివరించారు. మాజీ కార్పొరేటర్ పంచరెడ్డి సుదర్శన్, నాయకులు జావేద్ అక్రమ్, సుజన్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు. ఇందల్వాయి మండలంలోని నల్లవెల్లి, సిర్నాపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు జై బాపు, జై భీమ్,జై సంవిదాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యాంగం విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నవీన్ గౌడ్, దస్ల రాజు, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్ రెడ్డి, గంగారెడ్డి, దామ సుమన్, నవీన్ గౌడ్ పాల్గొన్నారు. జక్రాన్‌పల్లి మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి, తొర్లికొండ, కొలిప్యాక్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరించారు. కార్యక్రమాల్లో చిన్నారెడ్డి, సొప్పరి వినోద్, కనక రవి, నర్సారెడ్డి, గంగారెడ్డి, వసంతరావు, అనుపాల్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



సుద్దపల్లిలో గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



మంచిప్పలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి సూచించారు. శనివారం డిచ్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో యానంపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంతో పాటు సుద్దపల్లిలో ఐడీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. అనంతరం డిచ్‌పల్లి సొసైటీ ఆధ్వర్యంలో సుద్దపల్లిలో రూ.21లక్షల వ్యయంతో నిర్మించిన సహకార గోదాం ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సొసైటీ చైర్మన్లు రాంచందర్‌గౌడ్, తారాచంద్ నాయక్, చింత శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, న్యాస రాజేశ్వర్, నాయకులు ధర్మాగౌడ్, మోహన్‌రెడ్డి, కుమ్మరి గంగారాం, నర్సయ్య, పెద్దోళ్ల శ్రీనివాస్, రాము, డాక్టర్ షాదుల్లా, నరహరి, సొసైటీ సీఈవో ఓస సాయిలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

మోపాల్: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి పేర్కొన్నారు.మండలంలోని బాడ్సి సొసైటీ పరిధిలో గల మంచిప్పలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ముప్ప గంగారెడ్డి మాట్లా డుతూ అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. కడ్తా, తరుగు పేరిట రైతులకు నష్టం చేకూర్చితే ప్రభుత్వం కఠినంగా వ్య వహరిస్తుందని హెచ్చరించారు. కార్యక్రుజమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, వీడీసీ అధ్యక్షుడు వెంకట్రాం నాయక్, డైరెక్టర్లు గొల్ల శ్రీనివాస్, ఎం సాయన్న, నాయకులు తూర్పు రాజేశ్, సాయిరాం, భూపతిరెడ్డి, సాయిరెడ్డి, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	92,000	వెండి(కిలో)	94,000
22 క్యారెట్స్	84,915	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	200
	(కిలోకు)	లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	40	80
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	60	80
జీరకాయ	50	70	దోసకాయ	25	50
దొండకాయ	40	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	80	120	గోబిగడ్డ	12	24
కాకరకాయ	50	90	గోబిపువ్వు	40	60
వంకాయ	12	24	బీట్‌రూట్	20	40
పాలకూర	25	50	కరివేపాకు	70	120
మెంతికూర	60	90	చామగడ్డ	50	70
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	60	80
పుదీనా	50	80	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)
స్క్రీన్-1 ఆదిత్య–369–11.00
మ్యాడ్ స్క్వేర్–1.30, 7.30, 10.30
స్క్రీన్-2 రాబిన్‌హుడ్–1.30,7.30–శారీ–4.30
ఎల్‌వైఎఫ్–10.30
ఎల్–2 ఎంపురాన్(తెలుగు)–4.20, 10.30
స్క్రీన్-3 సికందర్(హిందీ)–11.00,1.40, 4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)
స్క్రీన్-1 సికందర్(హిందీ)–10.40, 4.35
ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ (3డీ ఇంగ్లీష్)–2.15, 8.10, 10.30
స్క్రీన్-2 ఎ మైన్‌క్రాఫ్ట్ మూవీ(3డీ ఇంగ్లీష్)–10.55
రాబిన్‌హుడ్–1.55
మ్యాడ్ స్క్వేర్–4.25, 10.10
సికందర్(హిందీ)–7.10
స్క్రీన్-3 సికందర్(హిందీ)–10.30, 1.30, 4.30, 10.35 ఎల్‌వైఎఫ్–7.30
స్క్రీన్ -4 వృషభ–11.00 –శారీ–2.00
28సీ–4.50 –రాబిన్‌హుడ్–7.15
ఆదిత్య369–10.25
లలితామహల్ కోర్ట్, దేవి రాబిన్‌హుడ్
నటరాజ్ షణ్ముఖ, విజయ్ మ్యాడ్ స్క్వేర్

సొంతింటి కల.. సాకారమయ్యేనా..?

- డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం పేదల ఎదురుచూపు
- నిర్మాణం పూర్తయినా పంపిణీ చేయని పరిస్థితి
- అర్హులను గుర్తించి పంపిణీ చేయాలంటూ పేదల వేడుకోలు



ధర్పల్లిలో నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

ధర్పల్లి: పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటు గత ప్రభుత్వం ప్రారంభించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకం నిరుపేదల ఆశలను ఆవిరి చేశాయి. నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అవి నిరుపయోగంగా మారి అసంపూర్తిగా ఉండిపోతున్నాయి.

పంపిణీకి నోచుకోక..

గత ప్రభుత్వ హయాంలో ధర్పల్లి మండల కేంద్రంలో 48 డబుల్ బెడ్ రూం ఇళ్లను నిర్మించారు. ఒక్కో ఇంటికి రూ.6 లక్షల చొప్పున రూ.2.88 కోట్లు కేటాయించారు. రెండేళ్ల క్రితం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. చిన్నపాటి పనులు చేయాల్సి ఉంది. ఇళ్ల పంపిణీకి నోచుకోక వృథాగా ఉంటున్నాయి. అర్హులను గుర్తించే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఇళ్ల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. డ్రెయినేజీలు, రోడ్డు నిర్మాణం, విద్యుత్, మంచినీటి సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సమస్యను పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామానికి చెందిన నిరుపేదలు ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి వినతి పత్రాలను అందజేశారు. కానీ స్పందించడం లేదు. ఇకనైనా డబుల్ బెడ్ రూం ఇళ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, అర్హులను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతున్నారు.